క్లుప్తంగా

రాంగ్ రూట్‌లో వెళ్తే ఫైన్ తప్పదు

సీఐ పీవీ అంజనేయులు



పిడుగురాళ్ల: రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తే ఫైన్ తప్పదని పట్టణ ఎస్సీ పీవీ ఆంజనేయులు శనివారం హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు, వాహనదారులకు, ప్రయాణికులకు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఐలాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బ్యారీకేడ్లు ఉన్నాయన్న ఉద్దేశంతో వాహన దారులు రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం ప్రాణాలకు ప్రమాదమని సూచించారు. రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన దారులకు, ఆటోలను ఫొటోలు తీసి అపరాధ రుసుంను విధిస్తున్నారు. అలాగే ద్విచక్ర వాహనంపై రాంగ్‌రూట్‌లో వస్తున్న వారి వాహనాలు ఆపి ఇలా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని, రాంగ్‌రూట్‌లో ప్రయాణించవద్దని ప్రజలకు పట్టణ సీఐ అంజనేయులు వివరిస్తున్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తే అపరాధ రుసుం తప్పదని ఈ సందర్భంగా సీఐ పేర్కొన్నారు.

వైభవంగా నృసింహస్వామి గ్రామోత్సవం



కారెంపూడి: సింగరుట్ల శ్రీలక్ష్మీనృసింహ స్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి పేటసన్నెగండ్ల గ్రామంలో వైభవంగా జరిగింది. ప్రజలు వేలాదిగా స్వామివారిని దర్శించుకుని వారు పోసి కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. శుక్రవారం రాత్రి స్వామి వారి కల్యాణం అనంతరం శనివారం రాత్రి స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి సింగరుట్ల క్షేత్రంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి (54వ ర్యాంకర్) బోయనపల్లి రేఖ, ప్రముఖ సంగీత దర్శకుడు అగస్త్యా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు రేఖ దంపతులు మంగళసూత్రాలు బహూకరించారు. అన్నదాన కార్యక్రమానికి ఆమె రూ.10 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా రేఖ మాట్లాడుతూ స్వామి వారు చాలా మహిమ గల వారని గతంలో నెలక్రితం స్వామి వారిని దర్శించుకుని సుదర్శన నారసింహహోమంలో పాల్గొన్నామని మళ్లీ ఇప్పుడు వచ్చామని ఎంతో చారిత్రక ప్రాధాన్యం విశిష్టత గల స్వయంభు నృసింహ స్వామి ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. రాత్రికి దేవాలయ హుండీ లెక్కింపును దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ కృష్ణంరాజు పర్యవేక్షణలో నిర్వహించారు, హుండీ ఆదాయం రూ.21,294లు వచ్చిందని ఆలయ ఈఓ సైదమ్మబాయి తెలిపారు. ఆలయ అర్చకులు మారేపల్లి వెంకటరమణాచార్యులు, విజయ్‌కుమారాచార్యులు గ్రామోత్సవంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వాదాలు అందించారు. కార్యక్రమంలో ధర్మకర్త గుండాల శ్రీనివాసరావు శ్రీ చక్ర సిమెంట్స్ అధికారులు సన్నెగండ్ల గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు ఘనంగా వీడ్కోలు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల రైల్వే పాసింజర్స్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ నుంచి గుంటూరు రైల్వే స్టేషన్‌కు బదిలీపై వెళ్తున్న సూపరింటెండెంట్ విజయ్‌కుమార్‌ను దుశాలువాలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. అదేవిధంగా బదిలీపై పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌కు నూతనంగా వచ్చిన నూతన సూపరింటెండెంట్ సీహెచ్ ఆంజయ్యను ఘనంగా సత్కరించారు. అలాగే పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో రాత్రి పూట ఆగని నారాయణ యాద్రి, చెన్నై, నర్సపూర్, విశాఖ ఎక్స్‌ప్రెస్, అదేవిధంగా నూతనంగా వస్తున్న వందేభారత్ రైలు పిడుగురాళ్ల రైల్వే స్టేషన్‌లో ఆపాలని జూలకంటి శ్రీనివాసరావు సూచించారు. అదేవిధంగా ప్లాట్‌ఫారంలో లిఫ్ట్ సౌకర్యం, ప్లాట్‌ఫారంలను అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ చింతా వెంకట రామారావు, కౌన్సిలర్ గర్నె నాగేశ్వరరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు చీదేళ్ల కృష్ణ, పతంగి అమర్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు



విజయపురిసౌత్: మాచర్ల శ్రీకృష్ణ జనరల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో చింతలతండాలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ గుర్రం రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 300 మంది రోగులకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజన ప్రాంత నిరుపేద ప్రజలకు కోసం ఈ మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బొమ్మిరెడ్డి స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కారెంపూడి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రతిభను చాటారు. వారిలో బాలికలే మిన్నగా రాణించారు. మండలంలో మొత్తం 700 మంది విద్యార్థులకు గాను 390 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. తెలుగు మీడియంలో 138 మందికి 47 మంది, ఇంగ్లిషు మీడియంలో 562 మందికి గాను 343 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో అత్యధిక మార్కులు, స్కూల్ ఫస్ట్ సాధించిన విద్యార్థుల వివరాలిలా ఉన్నాయి. కారెంపూడి ఏపీ టీడబ్ల్యూఆర్ పాఠశాల విద్యార్థి డి బాలస్వామి నాయక్ ఉత్తమ మార్కులు, కారెంపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి దాసరి అక్షయ్ ఉత్తమ మార్కులు, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని షేక్ బాజీ హర్షిణి ఉత్తమ మార్కులు, ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని షేక్ రిహానా ఉత్తమ మార్కులు, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాల విద్యార్థి అశోక్ నాయక్ ఉత్తమ మార్కులు, చినగార్లపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని బి బాబీ ఉ మాశ్రీ ఉత్తమ మార్కులు, కేజీబీవీ విద్యార్థిని టి మహిత ఉత్తమ మార్కులు, మిరియాల జెడ్పీ హైస్కూలు విద్యార్థిని బి ప్రశాంతి ఉత్తమ మార్కులు, ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల విద్యార్థిని ఆర్ నాగశివాంజి ఉత్తమ మార్కులు, తెలుగు మీడియంలో మిరియాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ప్రశాంతి ఉత్తమ మార్కు లు, చినగార్లపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కే భార్గవి ఉత్తమ మార్కులు, మర్రి సునీత ఉత్తమ మార్కులు సాధించారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

మాచవరం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని మోర్జంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినీ గోరిగె నవ్యశ్రీ ఇంగ్లిష్ మీడియంలో ఉత్తమ మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎంఈఓ ఎస్‌వీఆర్ ప్రసాద్ తెలిపారు. మండలంలో మొత్తం 457 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 277 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అత్యధికంగా జీకే పబ్లిక్ స్కూల్ 74 శాతం కాగా, అత్యల్పంగా పిన్నెల్లి జెడ్పీ హైస్కూల్ 36 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో షేక్ జాస్మిన్ ఉత్తమ మార్కులు సాధించింది. (జడ్పీ హైస్కూల్, మాచవరం),రాయల రాజేష్ ఉత్తమ మార్కులు (జీకే పబ్లిక్ స్కూల్, మాచవరం) కె. వెంకట తిరుపతమ్మ ఉత్తమ మార్కులు (జడ్పీ హైస్కూల్, వేమవరం) ,ఎం.రామాంజినేయులు, ఎస్.శ్రీనివాసరావు ఉత్తమ మార్కులు (జడ్పీ హైస్కూల్ , పిన్నెల్లి) మార్కులు సాధించారు. తెలుగు మీడియంలో కె. హనోకు ఉత్తమ మార్కులు (జీవీజీకేఆర్వో, పిల్లుట్ల) గంగిరెడ్డిపాటి షైదా ఉత్తమ మార్కులు (జెడ్పీ హైస్కూల్, పిన్నెల్లి), మంటి చరణ్ ఉత్తమ మార్కులు (జెడ్పీ హైస్కూల్, మాచవరం) మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయా స్కూళ్ల అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

దాచేపల్లి : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో దాచేపల్లి ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపించారని ప్రిన్సిపల్ ఎస్. రవికుమార్ చెప్పారు. శనివారం ప్రకటించిన ఫలితాల్లో పల్లి వెంకట సుహాసిని ఉత్తమ మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. కె. జయహాసిని, పి. కల్యాణ్‌రామ ఉత్తమ మార్కులతో నిలిచారు. 88 మంది విద్యార్థులకు గాను 72మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 20 మంది విద్యార్థులు 500 లకు పైగా మార్కులు సాధించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 208 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వీరిలో 112 పాస్ ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయురాలు పి. శైలజ చెప్పారు. పసుపులేటి గోపినాధ్ ఉత్తమ మార్కులు సాధించినట్లు హెచ్ఎం తెలిపారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు

దుర్గి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. శనివారం ప్రకటించిన ఫలితాల్లో ఓబులేశునిపల్లె జెడ్పీ స్కూల్ విద్యార్థిని కుంకులగుంట్ల జనప్రియ ఉత్తమ మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఏపి మోడల్ స్కూల్ విద్యార్థులు పి లక్ష్మి చంద్రిక, జి కిషోర్, ఇరువురు ఉత్తమ మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచారు. దుర్గి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని జి వరలక్ష్మి ఉత్తమ మార్కులతో తృతీయ స్థానం పొందింది. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు మొత్తం 423 మంది పరీక్షకు హాజరవ్వగా 227 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 65.48 శాతంతో మెరుగైన ఫలితాలు సాధించారు. ఓబులేశునిపల్లె జెడ్పీ హెచ్ స్కూల్ విద్యార్థులు 61 మంది పరీక్షలు రాయగా 40 మంది ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవిలో 30కి 71, మోడల్ స్కూల్‌లో 94కి 72, ముటుకూరు జెడ్పీహెచ్ఎస్ 53కి 23, అడిగొప్పల జెడ్పీహెచ్ఎస్ 68కి 40 మంది పాసైనట్లు ఎంఈఓ అల్లి సురేష్ తెలిపారు. మొదటి స్థానం పొందిన కుంకులగుంట్ల జనప్రియను ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్తమ ప్రతిభ చూపిన జిల్లా పరిషత్ విద్యార్థులు

మాచర్ల: పట్టణంలోని రైల్వే గేటు పక్కనున్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో శనివారం వచ్చిన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపి మండలంలోని 2వ స్థాయిలో నిలిచారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం ఐవి నాగమణి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని షేక్ షమీల, ప్రవళికలను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 2వ స్థాయి, పట్టణంలో మొదటి స్థాయి వివరాలు సాధించినట్లు తెలిపారు. పలువురు విద్యార్థినులు విజయకేతనం ఎగురవేసినట్లు తెలిపారు. పలువురు ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులకు అభినందనలు తెలుపుతూ మెమెంటోలు అందించారు.

విజయపురిసౌత్‌లో..

విజయపురిసౌత్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు శనివారం విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి తమ సత్తాను చాటుకున్నారు. ఈ పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థినీ బి అనూష ఉత్తమ మార్కులు సాధించి టాపర్‌గా నిలవగా, పి బిందు ఉత్తమ మార్కులు సాధించింది. ఈ పాఠశాలలో 101 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 62 మంది ఉత్తీర్ణత సాధించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థులకు గాను 46 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఆడెపు గాయత్రి ఉత్తమ మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా ఆడెపు భవిష్యశ్రీ ఉత్తమ మార్కులతో ద్వితీయ స్థానం, చెన్నా అక్షర ఉత్తమ మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. పీటీజీ పాఠశాలలో 46 మంది విద్యార్థులకు గాను 30 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో మూడావత్ హేమానాయక్ ఉత్తమ మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా కె భాస్కర్‌నాయక్ ఉత్తమ మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఆర్‌సీఎం ఉన్నత పాఠశాలలో 11 మంది విద్యార్థులకు గాను నలుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

పదిలో మండలం టాప్ మార్కులు

వెల్దుర్తి: 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో మండల టాపర్‌గా శిరిగిరిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దిరిసినాల శ్రీవల్లి ఉత్తమ మార్కులతో మొదటి స్థానంలో నిలవగా, కండ్లకుంట మోడల్ స్కూల్ విద్యార్థిని వై నాగమల్లీశరి ఉత్తమ ద్వితీయ స్థానం, మండాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కె ప్రవళ్ళిక ఉత్తమ మార్కులు సాధించినట్లు ఎంఈఓ అల్లి సురేష్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 8 పాఠశాలల్లో 420 మంది 10వ తరగతి విద్యార్థులు హాజరుకాగా వారిలో 175 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలం మొత్తం 42 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కండ్లకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6గురికి 2ఇద్దరు, కండ్లకుంట ఏపి మోడల్‌స్కూల్ లో 83కి 55 మంది, గుండ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 26కి 8, శిరిగిరిపాడుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 106కి 44, కస్తూరిబాగాంధీ 33కి 4, శిరిగిరిపాడులో ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్‌లో 40కి 16, మండాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 21 కి 10, వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 105కి 36 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ తెలిపారు.

రెంటచింతల్లో 76 శాతం ఉత్తీర్ణత

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించిన 10వ తరగతి-2023 పరీక్షా ఫలితాల్లో మండలంలో 712 మంది విద్యార్థులకు గాను 544 మంది ఉత్తీర్ణత సాధించడంతో 76 శాతం వచ్చినట్లు ఎంఈఓ ఐ.వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల 73 శాతం, వైఆర్ఎస్ స్కూల్ 37.5 శాతం, లూథరన్ బాలికల హైస్కూల్ 74 శాతం, ఏపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల 40.4 శాతం, సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 70.5 శాతం, జెట్టిపాలెం ఏపి మోడల్ స్కూల్ 40 శాతం, తుమృకోట జిల్లా పరిషత్ స్కూల్ 66 శాతం, మిట్టగుడిపాడు కస్తూర్బా పాఠశాల 63 శాతం, రెంటాల జెడ్పీ 81 శాతం, పాలువాయి జెడ్పీ 70.3 శాతం, ఫాతిమా విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 96 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు.

సత్తెనపల్లి డివిజన్‌లో 66.75 శాతం ఉత్తీర్ణత

సత్తెనపల్లి: డివిజన్‌లోని 14 మండలాల్లో పదో తరగతి పరీక్షలు 10,605 మంది విద్యార్థులు రాయగా 7,083 మంది ఉత్తీర్ణులయ్యారు. 66.75 వాతం ఉత్తీర్ణత నమోదైంది. ప్రథమ శ్రేణిలో 5,259 మంది, ద్వితీయ శ్రేణిలో 1,236 మంది తృతీయ శ్రేణిలో 588 మంది ఉత్తీర్ణులయ్యారు. 3,522 మంది ఫెయిల్ అయ్యారు. కాగా సత్తెనపల్లి డివిజన్ నుంచి సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గుత్తికొండ శివ మాధవరెడ్డి జిల్లా ప్రథమ స్థానం, మాజవరం మండలం మోర్జంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గొరిగే నవ్యశ్రీ జిల్లాలోనే ద్వితీయ స్థానం, మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ జాస్మిన్ జిల్లాలోనే ఉత్తమ మార్కులు సాధించినట్లు ఉప విద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

హక్కుల కోసం పోరాడిన వ్యక్తి వంగవీటి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక పోరాటాలు చేసిన వ్యక్తి వంగవీటి మోహన్ రంగా అని గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆంధ్రబ్యాంక్ సెంటర్‌లో వంగవీటి మోహన్ రంగా విగ్రహం ఏర్పాటుకు శనివారం భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా వంగవీటి మోహన్ రంగా విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ శాసన సభ్యుడిగా వంగవీటి మోహన్ రంగా హక్కుల సాధన కోసం సత్యాగ్రహం చేస్తుంటే ఆ రోజు ఉన్న టీడీపీ ప్రభుత్వంలో విజయవాడ నడిబొడ్డులో విచక్షణ రహితంగా రంగాను హత్య చేశారన్నారు. అయన చనిపోయి ఉండవచ్చు కానీ ఆయన చెప్పిన మార్గదర్శకాలను నాయకులు, యువకులు ఇప్పటికీ పాటిస్తున్నారన్నారు.

త్వరలో ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటు...

మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు(ఎన్‌టీఆర్) విగ్రహం ఏర్పాటు చేయాలని డాక్టర్ ఉన్నం నాగమల్లిఖార్జునరావు, బుల్లెట్ శ్రీనులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని రావడంతో స్పందించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వెంటనే ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు కావాల్సిన అనుమతులను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, వైఎస్సార్ సీపీ నాయకులు కొతారు నరసింహారావు, మాచవర మండల కనీవ్నర్ చౌదరి సింగరయ్య, కుందుర్తి గురవాచారి, భవనాశి యల్లారావు, మునగా నిమ్మయ్య, 1వ వార్డు కౌన్సిలర్ ఆంజనేయులు, నూతి నారాయణ, కొమ్మా మహేష్‌తోపాటు పలువురు బీసీ నాయకులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థిని స్మృతిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు లింగాల ధనలక్ష్మి, ఉపాధ్యాయులు

పిడుగురాళ్ల: పట్టణ, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థుల్లో మొత్తం 54 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ ఓ రాజు శనివారం ప్రకటించారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 600లకు గాను 680 మార్కులతో జి. స్మృతి పట్టణ, మండలంలో ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించింది. ఈ పాఠశాలలో 348 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 170 ఉత్తీర్ణులయ్యారు, ఇందులో 500 మార్కులకు పైగా 22 మంది సాధించారు. అలాగే 110 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్ సాధించినట్లు పాఠశాల హెచ్ఎం లింగాల ధనలక్ష్మీ తెలిపుతూ విద్యార్థిని జి. స్మృతిని అభినందించారు. అలాగే లెనిన్ నగర్ హైస్కూల్‌లో 34 మంది గాను 10 మంది పాస్ అయ్యారు. సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో 20 మందికి గాను 10 ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీలో 30 మందికి గాను 21 మంది పాసయ్యారు. అలాగే ఏపీ పీడబ్ల్యూ బాలిక గురుకుల పాఠశాలలో 20 మందికి గాను 18 మంది పాసయ్యారు. అలాగే ఏపీ డబ్ల్యూ బాలుర గురుకుల పాఠశాలలో 17 మందికి గాను10 మంది పాసయ్యారు. కరాలపాడు జెడ్పీ హెచ్ఎస్ స్కూల్‌లో 21 మందికి గాను 8 మంది పాస్, గుత్తికొండ హైస్కూల్‌లో 64 మంది విద్యార్థులకు గాను 26 మంది పాస్, బ్రాహ్మణపల్లి హైస్కూల్‌లో 151 మందికి గాను 98 మంది పాస్, తుమ్మలచెరువు హైస్కూల్‌లో 72 మందికి గాను 45 మంది ఉత్తీర్ణులయ్యారు. జానపాడు హైస్కూల్‌లో 107 మంది విద్యార్థులకు గాను 47 మంది ఉత్తీర్ణలయ్యారు. వెంకటాపురం హైస్కూల్‌లో 30 మందికి గాను 21 మంది ఉత్తీర్ణులయ్యారు. జూలకల్లు హైస్కూల్‌లో 70 మంది పరీక్షలు రాయగా 32 మంది ఉత్తీర్ణులయ్యారు. పట్టణం, మండలం మొత్తం 989 మంది పరీక్షలు రాగా 516 మంది విద్యార్థులు ఉత్తీర్ణతసాధించారు. మొత్తం 54 శాతం ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత సాధించారు.

ప్రతి గ్రామాన్ని సమష్టిగా అభివృద్ధి చేద్దాం

ఎంపీపీ మంగమ్మ



మాట్లాడుతున్న ఎంపీపీ మంగమ్మ

మాచర్ల: ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేద్దామని మండల పరిషత్ అధ్యక్షురాలు బూడిద మంగమ్మ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో మంగమ్మ మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత నివ్వడం జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు ఇచ్చే ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ప్రజలంతా సీఎం జగన్‌మోహన్ రెడ్డికి జే జేలు పలకాలని మంగమ్మ కోరారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, బూడిద శ్రీనివాసరావులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు మేలు చేసేందుకు సీఎం జగన్ అనేక సంక్షేమ, అభివృద్ధి చర్యలు తీసుకుంటున్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ముందుకెళ్ళాలని వారు కోరారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మాచర్ల నియోజక వర్గంలో వివిధ అభివృద్ధి పథకాలకు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవడం అభినందనీయమని కుర్రి సాయి మార్కొండారెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా మంచినీటి సమస, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా, లిఫ్ట్ ఇరిగేషన్, నిర్వాహణ, ఆర్‌బికె కేంద్రాల నిర్వాహణ, రోడ్ల పనులతో పాటు అన్నీ అంశాలను చర్చించి ఆమోదించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, జెడ్పిటీసీ మండ్లి పెద మల్లుస్వామి, మండల గౌరవ సలహాదారు బూడిద శ్రీనివాస్, ఎంపీడీఓ కోటేశ్వరరావు, వ్యవసాయ శాఖాధికారి లక్ష్మారెడ్డి, పంచాయితీ రాజ్ ఎఈ సురేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ బాబునాయక్, విద్యుత్ శాఖ ఎఈ రాంబాబు, ఆయా గ్రామ సర్పంచ్‌లు ఓరుగంటి చిన్నా, నోముల కృష్ణ, శ్రీనునాయక్, తోట నాగ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు జూకూరి వెంకట్రామయ్య, ఈశ్వరయ్య, మండల అధికారులు, ఎంపీటీసీలు పలువురు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ బూడిద మంగమ్మ, జెడ్పిటీసీ మండ్లి పెద మల్లుస్వామి, ఎంపీడీఓ కోటేశ్వరరావు తదితరులను శాలువలతో సత్కరించి అభినందించారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

జెట్టిపాలెం(రెంటచింతల): జెట్టిపాలెం ఆదర్శ పాఠశాల(ఏపి మోడల్ స్కూల్)లో 6వ తరగతి ప్రవేశానికి 2023-2024 విద్యాసంవత్సరానికి మే 9 నుంచి 25వ తేదీలోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కె. పాపయ్య కోరారు. శనివారం ఆయన పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు లాటరీ పద్ధతి ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారన్నారు. ఆంగ్లంలో ఉచితంగా విద్యాబోధన జరుగుతుందని ఓసి,బిసి కులాలకు చెందిన విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన విద్యార్థులకు (2009 సెప్టెంబర్-1 నుంచి 2013 ఆగస్టు 31) వరకు నాలుగు సంవత్సరాలు మినహాయింపు ఉంటుందన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2020-21లో 4వ తరగతి చదివి ఉండాలని, 2021-22లో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలన్నారు. వరుసగా రెండు విద్యాసంవత్సరాల్లో రెగ్యులర్‌గా చదవడంతో పాటు ఐదో తరగతి పూర్తి చేసిన వారికి మాత్రమే ఆరో తరగతిలో ప్రవేశం ఉంటుందన్నారు. మే నెల 25లోపు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 11-06-2023న ఉదయం 10గం. నుంచి మధ్యాహ్నం 12గం. వరకు స్థానిక పాఠశాలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు రుసుము ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ,ఎస్టీలకు రూ.75లు పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి జనరల్ నంబర్ పొందాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు పాఠశాలలో ప్రిన్సిపల్‌ను సంప్రదించాలన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు



దుర్గి: మండల పరిధిలోని గజాపురం అటవీ ప్రాంతంలో గత కొన్ని రోజుల క్రితం పెద్దపులి ఆవు పై దాడి చేసిన ఘటనా స్థలాన్ని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్. రామచంద్రరావు శనివారం సందర్శించారు. అటవీ ప్రాంతంలోని నెమలికుంట పరిధిలో రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం నుంచి వచ్చిన సాంకేతిక నిపుణులు సహాయంతో పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా పరిశీలించి పెద్దపులి జాడ కోసమై చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అటవీశాఖ అధికారి ఎస్. రామచంద్రరావు మాట్లాడుతూ పెద్ద పులుల జాడ కోసమై తమ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. వాటి ఆవాసాలకు ఇబ్బంది కలుగకుండా తగు జాగ్రత్తలతో పెద్దపులను టైగర్ జోన్ కు పంపేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానికులు రాత్రిపూట పొలాలకు వెళ్లకుండా ఉండాలని పగులు ఒక్కరు కాకుండా గుంపుగా వెళ్లేటట్లు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఆవు పై పెద్దపులి దాడి చేసిన ప్రాంతాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు అనంతరం అవును ఖననం చేసిన ప్రాంతాన్ని సందర్శించారు ఆయన వెంట వినుకొండ, మార్కాపురం, ఎర్రగొండపాలెం ,మాచర్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ల, తోపాటు స్థానిక బీట్ ఆఫీసర్లు ,సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హరేకృష్ణ ఆశ్రమంలో హరినామ సంకీర్తన

మాచర్ల: పీడబ్ల్యూడి కాలనీలో వేంచేసియున్న హరేకృష్ణ ఆశ్రమం (ఇస్కాన్) సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11.30గం''ల నుంచి 1.30గం''ల వరకు హరినామ సంకీర్తన యజ్ఞం, భగవద్గీత యదాతథ ప్రవచనం, హరేకృష్ణ మహామంత్ర జపయజ్ఞం, హారతి కీర్తన, మహా ప్రసాద విందును అందజేయటం జరుగుతుందని ఆశ్రమ నిర్వాహకులు శని వారం తెలిపారు. హరేకృష్ణ ఆశ్రమంలో జరిగే కార్యక్రమానికి భక్తులంతా అధిక సంఖ్యలో పాల్గొనిదేవుని సన్నిదిలో ఆశిస్సులు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు : 8309439335ను సంప్రదించాలని కోరారు.

గరుడ వాహనంపై వెంకటేశ్వర స్వామి గ్రామోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లోని అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కలియుగ దైవం శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారికీ విశేషంగా వైశాఖ మాసం, వైశాఖ బుద్ద పూర్ణిమ పురస్కరించుకుని శ్రీవారికి స్నపన తిరుమంజనం శనివారం శోభాయమానంగా జరిగింది. శ్రీమాన్ శ్రీ శ్యాము ఆచార్య రామానుజ దాసన్ గరుడల్వార్ మండపంలో వేంచేసి ఉన్న గరుడల్వార్ మూర్తికి, శ్రీమహాలక్ష్మి అమ్మవారికి మల్లెల్లతో విశేష పూజ, పుష్పభిషేకం నిర్వహించారు,

చౌడేశ్వరి అమ్మవారికి బోనాలు



ప్రత్యేక అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు



చౌడేశ్వరి అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

రెంటచింతల: స్వస్తిశ్రీ చాంద్రమానేన శ్రీను భకృత్ నామ సంవత్సర, వైశాఖమాస, బహుళ పాడ్యమి తత్కాల విదియ చౌడేశ్వరి అమ్మవారి జ్యోతిమహోత్సవములు నిర్వహించుటకు నిశ్చయించిన నేపధ్యంలో స్థానిక బాలవికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సమీపంలోని శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వేంచేసిన చౌడేశ్వరి అమ్మవారికి శనివారం చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా భక్తులు బోనాలను మేళతాలాలతో భక్తి శ్రద్ధలతో సమర్పించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు అనిల్ నేతృత్వంలో ఉదయం 6గం. నుంచి చౌడేశ్వరి అమ్మవారికి పలు రకాల అభిషేకాలను, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించి పొంగలి, పులిహారం పంపిణీ చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, రెంటచింతల సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య సతీసమేతంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. సకాలంలో వర్షాలు కురిసి పైరు పంటలు సంవృద్ధిగా పండి ప్రతి అన్నదాత ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని చౌడేశ్వరి అమ్మవారిని కోరుకున్నట్లు వెల్లడించారు. దేవస్థానానికి వివిధ రకాల రంగులను వేయించడంతో పాటు రంగురంగుల విద్యుత్ తోరణాలను అలంకరించడం కారణంగా నూతనశోభ ఉట్టిపడింది. దేవస్థానం పెద్దశెట్టి పల్లా నరసింహారావు, కమిటీ సభ్యులు ఈ ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పన, గ్రామాల అభివృద్ధే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెన్నాయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు గ్రామానికి విచ్చేసిన ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తెలియజేస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకునేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు పలు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్నాల పథకాల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే గ్రామంలో రూ.70 సీసీ రోడ్లు నిర్మాణాలు, రూ. 60లక్షలతో జల జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నాడు- నేడు ద్వారా రూ.25 లక్షలతో పాఠశాలల అభివృద్ధికి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో ఇంటి స్థలం లేని వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రజా సంక్షేమంతో పాటు, రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ బ్రోచర్లను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, జెడ్పీటీసీ జె.శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీలు చింతపల్లి నన్నే, చల్లగుండ్ల లక్ష్మయ్య, మండల యూత్ కన్వీనర్ మద్దు ప్రసాదు, సర్పంచుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అల్లాభక్షు, మాజీ యూత్ కన్వీనర్ నరసింహారెడ్డి, గ్రామ సర్పంచ్ మండ్ల మంగమ్మ, ఎంపీటీసీ సఫావత్ లక్ష్మీశ్రీనివాస్‌నాయక్, యార్డు డైరెక్టర్ ఈర్ల కాశమ్మ సుబ్బారావు, గ్రామ ఇన్‌చార్జి రామకోటయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు వట్టి రామిరెడ్డి, ఎస్‌సీ సెల్ మండల కన్వీనర్ పోలె జాన్ సైమన్, గ్రామ నాయకులు బాలు నాయక్, మరియదాసు, కాశిరెడ్డి, అన్నపరెడ్డి రామిరెడ్డి, మండల నాయకులు షైదా, అనిల్‌కుమార్, జానీ, నరసింహారెడ్డి, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈ సురేష్, విద్యుత్ శాఖ ఏఈ మస్తాన్, ఎంపీడీఓ వై.రాజగోపాల్, ఈఓఆర్‌డీ వెంగళరావు, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.